


ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి వాగు(ఫైల్)



భవనాశి బెడద

- వరదలతో పొంచివున్న ముప్పు
- దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్య
- ప్రాణాలు పోతున్నా పట్టని పాలకులు, అధికారులు
- వరదొస్తే రెండు రాకపోకలకు ఇబ్బందులు

ఆత్మకూరు, జూన్ 19: నల్లమలలో భారీ వర్షాలు కురిస్తే భవనాశి ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రజలను ముప్పతిప్పలు పెడుతుంది. రెండు మండలాల ప్రజలకు రాకపోకల సమస్య ఏర్పడుతుంది. ఈ వరద బెడద ఈనాటికి కాదు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి. అయినా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



కొత్తపల్లి - ఆత్మకూరు రహదారిపై ఉప్పొంగి ప్రవహిస్తున్న వరద నీరు(ఫైల్)

శిథిలావస్థకు చేరిన భవనాశి వంతెన



భవనాశి నదీ ప్రవాహంలో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లు

జిల్లాలోని అహోబిలం పుణ్యక్షేత్రం నల్లమల పర్వతసానువుల నడుమ ఉద్భవించిన భవనాశి నది వివిధ మండలాల దాటుతూ, ఆత్మకూరు పట్టణ శివారులోంచి తూర్పు నుంచి పడమరకు ప్రవహిస్తూ కొత్తపల్లి మండలంలోని సప్తనది సంగమస్థలిలో కలుస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లో ఒట్టికుండలా కనిపించే భవనాశి వరదల సమయంలో మాత్రం ఉగ్రరూపం దాల్చుతుంది. నల్లమల అడవుల్లో కురిసే వర్షంతో పాటు పంటపొలాల్లో కురిసిన వర్షపునీటితో వాగులు, వంకలు ఏకమై భవనాశి ఉధృతమవుతుంది. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు ఏ చిన్న అవసరమొచ్చినా.. ఆత్మకూరు పట్టణానికి రావాల్సిందే. అయితే భారీ వర్షాలు కురిసి భవనాశి ఉప్పొంగితే మాత్రం ఇరు మండలాల రాకపోకలకు అంతరాయం నెలకొంది. తప్పని పరిస్థితుల్లో రోడ్డుదాటే ప్రయత్నం చేస్తే.. ప్రాణాలు కోల్పోవాల్సి వుంటుంది. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వాలు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వరదొస్తే.. ఇరు మండలాలకు రాకపోకలు బంద్..

భవనాశి నదికి వరదొస్తే చాలు ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల రాకపోకలు నిలిచిపోతాయి. కొత్తపల్లి మండలంలోని సుమారు 17 గ్రామాలతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కొలనుభారతి, సంగమేశ్వరం క్షేత్రాలకు కూడా వెళ్లేందుకు వీలు ఉండదు. అంతేకాకుండా ఆత్మకూరు మండల పరిధిలోని కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు శివభాష్యంసాగర్ ప్రాజెక్ట్‌కు కూడా రాకపోకలు స్తంభిస్తాయి. ఇలా భవనాసి నది వరదల సమయంలో ఉగ్రరూపం దాల్చడం వల్ల రెండు మండలాల ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ప్రత్యేకించి వరదల సమయాల్లో విద్యార్థులు పరీక్షలు ఉన్నప్పుడు, ఏదైనా అత్యవసర సేవలు అవసరమైనప్పుడు ఆయా గ్రామాల ప్రజలు పడే ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. కాగా ప్రస్తుతం వున్న వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుని నీటి ప్రవాహానికి ఇరుగ్గా మారింది. ఈ పరిస్థితిల్లో భవనాశిపై ఎత్తులో వంతెన నిర్మాణం చేపట్టడమే కాకుండా నదీ ప్రవాహంలో వున్న పూడికను తొలగించేందుకు పాలకులు దృష్టి సారిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఇప్పటికైనా.. భవనాశి నదికి వరద కష్టాలను తీర్చేందుకు పాలకులు ప్రయత్నించాలని ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల ప్రజలు కోరుతున్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించేనా..?



వరదల సమయంలో ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న భవనాశి వరద సమస్యకు పరిష్కారం లభించేనా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. నదీ ప్రవాహమార్గం వెంట కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు పూడిక ఏర్పడి జలప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. దీంతో నదీప్రవాహం సజావుగా జరగకుండా భవనాశి నదీ వంతెనపైకి వరదనీరు చేరడమే కాకుండా చుట్టుపక్కల పంటపొలాల్లోకి వరదనీరు చేసి పంట నష్టం జరుగుతోంది. 2020 సెప్టెంబరు 13న సంభవించిన భారీ వర్షాల భవనాశి పరిసర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. అదేవిధంగా వరదలొస్తే.. సుమారు 200 మీటర్ల మేర రహదారి భవనాశి కోరల్లో చిక్కుకోవాల్సిన పరిస్థితి దాపరిచింది. ఇలాంటి సందర్భంలో వాగు దాటేందుకు ప్రయత్నిస్తే.. వరద ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోవాల్సిన దుస్థి తి నెలకొంది. 2012 సెప్టెంబరు 2వ తేదిన భవనాశి ఉప్పొంగించిన సమయంలో కురుకుంద గ్రామానికి చెందిన బాషా, ఉదయ్‌కుమార్ అనే విద్యార్థులు వాగు దాటేందుకు ప్రయత్నించి గల్లంతయ్యారు. వీరిలో ఉదయకుమార్ అనే విద్యార్థిని అప్పటి ఆత్మకూరు ఎస్సై శ్రీహరి రక్షించగా బాషా అనే బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. పలు సందర్భాల్లో ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు సైతం వాగులో కొట్టుకుపోయిన అనుభవాలు ఉన్నాయి.



భవనాశికి వరదొస్తే రాకపోకలు బంద్

భవనాశి నదికి వరదొచ్చి ఉప్పొంగి ప్రవహిస్తే మా గ్రామం నుంచి ఆత్మకూరుకు రాకపోకలకు అంతరాయం కల్గుతోంది. అనేక సందర్భాల్లో వరద ఉధృతి వల్ల రోజుల తరబడి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భవనాశిపై వంతెన నిర్మాణం చేపట్టాలి.

- శంకర్, కురుకుంద గ్రామం, ఆత్మకూరు మండలం



వంతెన నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం

ఆత్మకూరు పట్టణ శివార్లలో భవనాశి నదికి వరదలొస్తే ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఒక్కోసారి రెండు, మూడు రోజులకు కూడా వరద తగ్గుముఖం పట్టదు. నదిపై ఎత్తులో వంతెన నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

- గంగన్న, గుమ్మడాపురం

నేరుగా నాతో మాట్లాడవచ్చు

- 9154987020 నెంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ కాల్ చేయండి
- ఎస్పీ రఘువీర్‌రెడ్డి



నంద్యాల క్రైం, జూన్ 19 : జిల్లా ప్రజలు నేరుగా తనతో మాట్లాడవచ్చని, 9154987020 నెంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ కాల్ చేయవచ్చు అని ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా సమీప పోలీసు అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అక్కడ న్యాయం జరగకపోతే తన నెంబర్ 9154987020కు ఫోన్ కానీ, వాట్సాప్ గానీ చేసి నేరుగా మాట్లాడవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైనా, జాబ్ ఇప్పిస్తామని మోసం చేసినా, బిట్ కాయిన్స్‌కు సంబంధించిన సమస్యలైనా, లోన్ యాప్‌లలో మోసపోయినా మొదటగా 1930కి లేదా సైబర్ క్రైం ప్రభుత్వ వెబ్‌సైట్లో కానీ, జిల్లా సైబర్ క్రైం విభాగాన్ని గానీ సంప్రదించాలని ఎస్పీ వివరించారు.

రెవెన్యూ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జూన్ 19: ఈనెల 20వతేదీన నిర్వహించే రెవిన్యూ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నంద్యాల కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వము ప్రతి ఏటా జూన్ 20వతేదీన రెవిన్యూదినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రెవిన్యూ దినోత్సవ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రెవిన్యూ పరిధిలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రెవిన్యూ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, భూ వ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే ధృవీకరణ పత్రాలు, నీటి పన్నుతో సహా పలు అంశాలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిందన్నారు. పదవీ విరమణ చేసిన రెవిన్యూ ఉద్యోగులను కూడా ఆ రోజున సన్మానించుకోవాలని సూచించిందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

వర్షాలు లేక నష్టపోయాం

- ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం
- కేంద్ర కరువు బృందంతో రైతుల ఏకరువు
- ఆలూరులో రైతులతో కేంద్ర కరువు బృందం పర్యటన
- రైతులతో ముఖాముఖి
- కరువు నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తాం
- ఐఏఎస్ అధికారి చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్



మాట్లాడుతున్న కరువు బృందం

ఆలూరు, జూన్ 19: రబీలో వర్షాలు రాక, సాగు చేసిన పంటలు దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయామని ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ కేంద్ర కరువు బృందానికి రైతులు ఏకరువు పెట్టారు. బుధవారం కేంద్ర కరువు బృందం ఆలూరులో పర్యటించారు. గత సంవత్సరం రబీ సీజన్‌లోని కరువు పరిస్థితులను పరిశీలించేందుకు ముందుగా ఆలూరు పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో చేసిన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్ మినీ స్టీరియల్ సెంట్రల్ టీమ్ సభ్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్పెండీచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్ (ఐఏఎస్) తాగునీరు, పారిశుద్యశాఖ డిప్యూటీ అడ్వైజర్ (పీహెచ్‌ఈ) ఆసిష్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద్ కుమార్, సోని హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో నిత్యం కరువు కాటకాలతోఇబ్బందులకు గురి అవుతున్నామన్నారు. ఈ ప్రాంతంలో రబీ, ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు దిగుబడి రాలేదని, దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయామని వివరించారు. మరోవైపు నకలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. సాగునీటి సమస్య పరిష్కారం అవ్వాలంటే పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. రబీలో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలని కోరారు. కరువు మండలాల జాబితాలో కర్నూలు, తుగ్గలి మండలాలను చేర్చలేదని తెలిపారు.

● ఆంగ్లంలో రైతు సమస్యలు విన్నవించిన బెంగళూరు కిషోర్...

ఆలూరు ప్రాంతంలో కరువు, వర్షాభావ పరిస్థితులు, పెండింగ్ ప్రాజెక్టులు, సాగు, తాగునీటి సమస్యలపై టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ కేంద్ర బృందానికి ఇంగ్లీష్‌లో వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రంగమ్మ, ఆలూరు సర్పంచ్ అరుణాదేవి, సీపీఎం నాయకులు హనుమంతు, నారాయణస్వామి, వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మీ, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, ఆలూరు ఏడీ సునీత, ఏవో వెంకటేశ్ గౌడ్, హార్టికల్చర్ పీడీ ఉమాదేవి, ఏవోలు అక్బర్ బాష, దేవభూషణం, నరేంద్ర కుమార్, ఆనంద్, ఆలీ పీరా, జయలక్ష్మీ, శివశంకర్ పాల్గొన్నారు.

● రైతులతో ముఖాముఖి

కోడుమూరు, జూన్ 19: కోడుమూరు ఎంపీడీవో సమావేశ భవనంలో కేంద్ర కరువు బృంద సభ్యులు రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. రూ.60 వేలు ఖర్చు చేసి మూడు ఎకరాల్లో శనగ పంట వేస్తే మూడు ఎకరాలకు కలిపి క్వింటన్నరకు మించి దిగుబడి రాలేదని, ఖరీలో వర్షాలు లేక దీనికి తోడు రబీలో ఎల్లెల్సీ, జీడీపీ కాల్వలకు సకాలంలో నీరు రాక పంటలు ఎండిపోయాయని కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లెల్సీ, జీడీపీ కాల్వకు నీరు అందించకపోవడం వల్ల తమ పంటలు ఎండిపోతున్నాయని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన సీతారాముడు అన్నారు. ఎకరాకు రూ.18వేలు ఖర్చు చేసి శనగ పంట వేస్తే ఆరు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చిందని వర్కూరు గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.


సెంచరీ కొట్టిన మిర్చి

టమోటా కూడా..

చికెన్‌తో పోటీ పడుతున్న బీన్స్ ..

అదిరిపోయే ధరలతో సామాన్యుల బెంబేలు





డోన్ రూరల్ / కొలిమిగుండ్ల రూరల్, జూన్ 19: బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. నిన్న మొన్నటి వరకు అందుబాటులోనే ఉన్న కూరగాయల ధరలు కొద్ది రోజుల వ్యవధిలోనే ఒక్కసారిగా సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. దీంతో కూరగాయలు కొనాలంటేనే భయపడిపోయే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వంటింట్లో ప్రధాన అవసరమైన పచ్చి మిర్చి, టమోటా ధరలు సెంచరీని క్రాస్ చేయగా, బీన్స్ ధర చికెన్‌తో పోటీ పడే స్థాయికి చేరుకుంది. దినసరి సంత మార్కెట్లో పచ్చి మిర్చి ధర రూ.100, 120 పలుకుతుండగా, టమోటా ధర రూ.100కు చేరుకుంది. బీన్స్ ధర రూ.220 వరకు చేరుకొని చికెన్ ధరతో సమానం అన్న పరిస్థితి నెలకొంది. కిలో రూ.50లోపు ఏ ఒక్క కూరగాయలు దొరకని పరిస్థితి. కిలో ఆలుగడ్డ రూ.50లు, బెండ రూ.60లు, క్యాబేజీ రూ.50 పలుకుతున్నాయి. దీంతో కూరగాయలు కొనడానికి మార్కెట్‌కు వచ్చిన మహిళలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఎండల తీవ్రత తగ్గినప్పటికీ కూరగాయల ధరలు మండిపోతుండటంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు ఏం కొనేటట్టు లేదని వాపోతున్నారు. కొద్ది రోజుల క్రితం రూ.100, 200కు అన్ని రకాల కూరగాయలు దొరికేవని, ప్రస్తుతం రూ.500 వెచ్చిస్తేగానీ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ఉత్పత్తి తగ్గిపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

● డోన్ ప్రాంతంలో 60 హెక్టార్లలో టమోటా సాగు చేశారు. పంట చేతికి రావడానికి మరో రెండు నెలలు పడుతుంది. దీంతో మార్కెట్‌కు మదనపల్లి, అనంతపురం, ప్రాంతాల నుంచి టమోటా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. డోన్ ప్రాంతంలో మిర్చి సాగు కూడా తగ్గిపోవడంతో మిర్చి రేటు అమాంతంగా పెరిగింది. దీంతో సామాన్యులు కూరగాయలు కొనాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు.

● మార్కెట్‌కు వెళ్లడం మానేశాను



కూరగాయల మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. కూరగాయల కొనుగోలుకు మార్కెట్‌కు వెళ్లడం మానేశాను. సామాన్యులు, పేదలకు కూరగాయల ధరలు అందుబాటులో లేవు.

ఎస్.తనూజ, డోన్, గాంధీనగర్

● రెండు నెలల సమయం పడుతుంది

డోన్ ప్రాంతంలో సాగులో ఉన్న టమోటాకు దిగుబడి చేతికి రావడానికి రెండు నెలల సమయం పడుతుంది. వేసవి కాలం ముగియడంతో రైతులు టమోటా సాగుకు సంసిద్ధమయ్యారు. సాగులో ఉన్న టమోటా చేతికి రావడానికి మరో రెండు నెలల సమయం పడుతుంది.

- కళ్యాణి, ఉద్యానశాఖ అధికారి

మేయర్ పీఠం కోసం టీడీపీ?

● పెరుగుతున్న టీడీపీ కార్పొరేటర్ల సంఖ్య ● మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సిద్ధం?



కర్నూలు(న్యూసిటీ), జూన్ 19: నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు టీడీపీ నాయకులు సిద్ధమవుతున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో 52 వార్డులు ఉన్నాయి. ఇందులో కర్నూలు అసెంబ్లీ-33, పాణ్యం-16, కోడుమూరు-3 ఉన్నాయి. 2021 జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో పాణ్యం అసెంబ్లీలో 16 వైసీపీ అభ్యర్థులు గెలుపొందగా, కోడుమూరులో ముగ్గురు గెలిచారు. అయితే కర్నూలు అసెంబ్లీ పరిధిలో 24 మంది వైసీపీ, 9 మంది టీడీపీ కార్పొరేటర్లుగా గెలిచారు. వైసీపీకి మెజారిటీ ఎక్కువగా ఉండటంతో 19వ వార్డు కార్పొరేటర్ బీవై. రామయ్యను మేయర్‌గా ఎన్నుకున్నారు.

● కూటమి విజయంతో మేయర్ పీఠానికి ఎసరు...

ఇటీవలి ఎన్నికల్లో కూటమి తరపున కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీజీ భరత్ 20వేలకు పైగా ఓట్లతో గెలిచారు. దీంతో నగర పాలక సంస్థలోని కొందరు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ముందే వైసీపీకి చెందిన 17, 22వ వార్డు కార్పొరేటర్లు టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ క్రమంలో కౌంటింగ్ పూర్తయిన మరుసటి రోజు నగరంలోని 3,4,6,13వ వార్డులకు చెందిన కార్పొరేటర్లు ఎమ్మెల్యే టీజీ భరత్ సమక్షంలో పార్టీలో చేరారు. దీంతో కర్నూలు అసెంబ్లీ పరిధిలో టీడీపీ కార్పొరేటర్ల సంఖ్య 16కి చేరింది. ఈ నేపథ్యంలో కోడుమూరు నియోజకవర్గం నుంచి ఒకరు, పాణ్యం నియోజకవర్గం నుంచి ఒకరు ఇప్పటికే టీడీపీలో చేరారు. మొత్తం 52 కార్పొరేటర్లు ఉండగా ఇప్పటికే మూడు నియోజకవర్గాలకు సంబంధించి 18 మంది టీడీపీలో ఉన్నారు.

● 27 మంది ఉంటే అవిశ్వాసం..

27 మంది కార్పొరేటర్లు టీడీపీ వైపు ఉంటే అవిశ్వాస తీర్మానం పెట్టి మేయర్‌ను గద్దెనుంచి దింపేయవచ్చు. ఈ క్రమంలో కర్నూలు ఎంపీగా పోటీ చేసిన బీవై. రామయ్య పరాజయం పాలయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉండగా అన్ని పదవులు ఎందుకంటూ గతంలో పార్టీలో కొందరు వ్యతిరేకించడంతో దానిని తొలగించారు. ప్రస్తుతం ఎంపీగా కూడ ఓడిపోవడంతో మేయర్ ఒక్కటే శరణ్యమైంది. ప్రస్తుతం మూడు నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు గెలవడంతో రామయ్య పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ఎంపీగా ప్రజలు తిరస్కరించారు...మేయర్‌గా కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారు. అయితే కోడుమూరు నుంచి ఒకరు, పాణ్యం నుంచి ఐదుగురు, కర్నూలు నుంచి మరో ఐదుగురు టీడీపీలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మెజార్టీ కార్పొరేటర్లు కలిసి మేయర్‌ను తొలగించేందుకు అవిశ్వాసం తీర్మానం పెట్టడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు

ఓర్వకల్లు, జూన్ 19: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై కాల్వబుగ్గ గ్రామ సమీపాన గల కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బళ్లారికి చెందిన వెంకటేశ్ నంద్యాలలో ఓ ఫంక్షన్‌కు వెళ్లి బళ్లారికి వెళ్తుండగా.. కాశిరెడ్డి ఆశ్రమం వద్ద ట్రాక్టరును ఢీకొనడంతో వెంకటేశ్ (50) మృతి చెందాడు. మృతుని తల్లి నాగరత్నమ్మ, డ్రైవర్ విజయ్‌కు గాయాలయ్యాయి. వీరిని హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి క్రాస్ అవుతున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ట్రాక్టర్ నుజ్జునుజ్జయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

ఓర్వకల్లు, జూన్ 19: మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై ఓర్వకల్లు గ్రామ సమీపంలోని పవర్‌గ్రిడ్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి రెండు కాళ్లు విరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. ఓర్వకల్లు గ్రామానికి చెందిన నాగరాజు (52) విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు పక్క వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

● ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు(అర్బన్), జూన్ 19: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి బీ.సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. బుధవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరానికి విద్యను అందించబోయే గురువులు అత్యున్నత విలువలను సంతరించుకోవాలని సూచించారు. శిక్షణా సమయంలో నేర్చుకున్న మెలకువలను పాఠశాలల్లో ఆచరిస్తూ విద్యార్థులకు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వారీని తనిఖీ చేసిన గనుల శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్), జూన్ 19: ఆదోని మండలం కపటి గ్రామంలో సర్వే నెంబర్ 1 దగ్గర ఉన్న గ్రానైట్ క్వారీని తనిఖీ చేశామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు. సదరు గ్రానైట్ క్వారీ పనులు జరగడం లేదని గుర్తించామని పేర్కొన్నారు. తదుపరి చర్యలకు సంబంధించి లీజు దారుడికి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

కర్నూలు(అర్బన్), జూన్ 19: నిరుద్యోగ యువతకు ఈనెల 21న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి. దీప్తి తెలిపారు. సి. క్యాంప్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ఫోన్‌పే, భారత్ ఫైనాన్షియల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, మెకానిక్ ఆపరేటర్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 13,500 నుంచి రూ. 15 వేలకు వేతనం ఉంటుందని, 18 నుంచి 32 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 19: నంద్యాల ఎన్జీవో కాలనీలో మ్యాన్ హోల్‌లో బుధవారం ఓ మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. నూనె పల్లెకు చెందిన రామకృష్ణ (35) ఫ్లవర్ డెకరేషన్ షాపులో పని చేస్తున్నాడు. అతనికి, నారాయణ అనే మరో వ్యక్తికి మధ్య మూడు రోజుల క్రితం ఎన్జీవోస్ కాలనీలోని కో ఆపరేటివ్ కమ్యూనిటీ హాల్‌లో ఘర్షణ జరిగింది. కమ్యూనిటీ హాల్‌లోని గ్యాస్ సిలిండర్లు అమ్ముకోగా వచ్చిన నగదు పంపకాల మధ్య గొడవ జరిగాక ఆదివారం రాత్రి నుంచి రామకృష్ణ కనిపించలేదని కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం కమ్యూనిటీ హాల్ సమీపంలోని మ్యాన్ హోల్‌లో రామకృష్ణ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వ జన వైద్యశాల మార్చురీ గదికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

ఇంట్లో చోరీ

నంద్యాల (నూనెపల్లె), జూన్ 19: నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వనగర్ బలిజ పేటలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వ్యాపారి అయిన నాగేంద్ర కుటుంబ సభ్యులు సోమవారం వెలుగోడు మండలం బోయరేవుల గ్రామంలోని సమీప బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లుగా స్థానికులు గుర్తించి నాగేంద్రకు సమాచారం ఇచ్చారు. ఇంటికి చేరుకున్న నాగేంద్ర బీరువాలోని రూ.2 లక్షల నగదు, 7.50 తులాల బంగారు, పట్టు చీరలు దొంగలు అపహరించినట్లు గుర్తించారు. టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడు నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

పోటీ చేసిన అభ్యర్థులు తుది అకౌంట్లు సమర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 19: వ్యయ పరిశీలకులకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేసిన అభ్యర్థులు తుది అకౌంట్లు సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే మధుసూదన్‌రావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై పార్టీల ప్రతినిధులతో, ఏఈవో (అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ ఆఫీసర్)లతో డీఆర్వో కే. మధుసూదన్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుకు సంబంధించి తుది అకౌంట్స్ ఈ నెల 25లోగా వ్యయ పరిశీలకులకు సమర్పించాలని అన్నారు. ఈ నెల 28వ తేదీన వ్యయ పరిశీలకులు వచ్చి అభ్యర్థుల అకౌంట్లు పరిశీలిస్తారన్నారు. డిస్ట్రిక్స్ ఎక్స్‌పెండీచర్ నోడల్ ఆఫీసర్ కే.రమేష్‌బాబు, డీసీవో (డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్) రామాంజనేయులు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ విజయలక్ష్మి, వ్యయ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏడుగురు సీఐలకు స్థానచలనం

కర్నూలు, జూన్ 19: కర్నూలు, అనంతపురం రేంజ్ పరిధిలో ఏడుగురు సీఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి.రామకృష్ణ	ఆన్ రిపాట్రియేషన్ ఫ్రమ్ ఎస్‌హెచ్‌ఆర్‌సీ కర్నూలు	కడప వన్‌టౌన్ యుజీ పీఎస్
సి.భాస్కర్ రెడ్డి	కడప వన్‌టౌన్ యుజీ పీఎస్	వీఆర్, కర్నూలు
కే.రమణారెడ్డి	ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్	ఖాజీపేట యుజీ పీఎస్
పి.రామాంజులు	ఖాజీపేట, యుజీ పీఎస్	వీఆర్, కర్నూలు రేంజ్
ఎస్.తేజ మూర్తి	ఆదోని వన్‌టౌన్ యుజీ పీఎస్	చిన్న చౌక్ యుజీ పీఎస్
పి.నరసింహారెడ్డి	చిన్న చౌక్ యుజీ పీఎస్	వీఆర్, కర్నూలు రేంజ్
ఈ.కంబగిరి రాముడు	ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు	సీసీఎస్, కర్నూలు

ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసినందుకే వైసీపీకి గుణపాఠం

- రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల టౌన్, జూన్ 19 : రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా అలక్ష్యం చేసి ప్రాజెక్టులను శిథిలావస్థకు దిగజార్చడంతోనే సార్వత్రిక ఎన్నికల్లో జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం నేర్పారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం, జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన ప్రాజెక్టుల సందర్శన, తదితర కార్యక్రమాల్లో రాయలసీమ సమగ్రాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందన్న హామీ మేరకు రాయలసీమ ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. రాయలసీమ సమగ్రాభివృద్ధితో పాటు సాగునీటి రంగ అభివృద్ధికి సిద్ధేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్, తదితర నిర్మాణాలతో పాటు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు, సీడ్ హబ్, హార్టికల్చర్ హబ్, తదితర అంశాలను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాయలసీమ కూడా ఏపీలో బాగమనే భావనతో సమగ్రాభివృద్ధికి అన్ని కార్యక్రమాలు చేపట్టతామని చంద్రబాబు ప్రకటించడాన్ని సాగునీటి సాధన సమితి ప్రత్యేకంగా ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం అరకొరగా సీమలో ఉన్న కొన్ని కార్యాలయాలను తరలిస్తున్నారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, తరలింపు చేపట్టడంలేదని ప్రభుత్వం ప్రకటిస్తూనే రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తామన్న సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలకు కార్యాచరణ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని బొజ్జా పేర్కొన్నారు. అత్యంత ప్రాధాన్యతగా ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్ర సమగ్రతకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

లోకేశ్‌ను కలిసిన మల్లెల



నంద్యాల (నూనెపల్లె), జూన్ 19: రాష్ట్ర మానవ వనరులు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్ బుధవారం కలిశారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. నంద్యాల జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ సీట్లను టీడీపీ క్లీన్ స్వీప్ చేయడంపై మల్లెల రాజశేఖర్‌గౌడ్‌ను అభినందించారు.

టీడీపీ బ్యానర్ల దహనం



లింగాపురంలో కాలిపోయిన టీడీపీ నాయకుల బ్యానర్లు

బండిఆత్మకూరు, జూన్ 19: మండలంలోని లింగాపురం గ్రామంలో టీడీపీ బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బుధవారం రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన టీడీపీ బ్యానర్లపై పెట్రోల్ పోసి కాల్చి వేశారు. అయితే ఇది స్థానిక వైసీపీ నాయకుల పనేనని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న బండిఆత్మకూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

నేడు జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన

● గత ఏడాది రబీలో పంట నష్టంపై పరిశీలన



అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల టౌన్, జూన్ 19 : జిల్లాలో గురువారం కేంద్ర కరువు బృందం పర్యటించనుంది. గత ఏడాది రబీలో జరిగిన పంట నష్టంపై పరిశీలన, సమగ్ర వివరాలను కేంద్ర బృందం ఆరా తీస్తుందని అధికార వర్గాలు వెల్లడించాయి. జిల్లాలోని 13 మండలాల్లో గత ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటల్లో 36,359 హెక్టార్లల్లో పప్పుశనగ, 4116 హెక్టార్లల్లో మినుములు, 2070 హెక్టార్లల్లో పొగాకు, 12908 హెక్టార్లల్లో జొన్న పంటలకు నష్టం జరిగింది. దీనిపై అప్పట్లో వ్యవసాయ శాఖ అధికారులు కేంద్రానికి నివేదిక పంపించారు. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌లో జరిగిన పంట నష్టంపై పరిశీలించేందుకు కేంద్ర బృందం ఉమ్మడి జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటన నేపథ్యంలో 20వ తేదీ నంద్యాల జిల్లాలో వివిధ ప్రాంతాల్లో బృందం పర్యటన ఖరారైంది. కేంద్ర కరువు బృందం టీమ్ లీడర్‌గా న్యూఢిల్లీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండేచర్ డైరెక్టర్ ఐఏఎస్ చిన్మయ గాట్‌మేర్, కేంద్ర తాగునీరు, పారిశుధ్య శాఖ డిప్యూటీ సలహాదారుడు ఆశీష్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అరవిందకుమార్ సోనిలతో కూడిన బృందం పరిశీలనకు రానున్నారు. ఇందులో భాగంగా తమ్మరాజుపల్లె వాటర్ స్కీమ్, కోవెలకుంట్ల మండలం భీమునిపాడు, ఉయ్యాలవాడ మండలంలోని హరివరంలతో పాటు పర్యటన మార్గమధ్యంలో మరికొన్ని ప్రాంతాల్లో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో కరువు వాస్తవ పరిస్థితులపై ఆరా తీయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కేంద్ర కరువు బృందం రానున్న నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే ఆయా మండలాల అధికారులకు కేంద్ర బృందానికి వివరించే వివిధ అంశాలపై కార్యాచరణ సిద్ధం చేశారు. కరువు తీవ్రతను బృందానికి సమగ్రంగా వివరించేలా గత ఏడాది రబీలో దెబ్బతిన్న పంట పొలాలకు సంబంధించి పంట ఫొటోలను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. పశుగ్రాసం కొరత వల్ల తగ్గిన పాల ఉత్పత్తి, కరువు మండలాల్లో ప్రభుత్వం ద్వారా కూలీలకు కల్పించిన పనులు, మంచినీటి ట్యాంకర్ల ద్వారా కొన్ని ప్రాంతాల్లో చేసిన మంచినీటి సరఫరా, రబీలో సాగైన కొన్ని పంటలకు సాగునీటి సరఫరాకు సంబంధించిన వివరాలను కేంద్ర బృందానికి వివరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన ముఖ్యమైన అధికారులు కేంద్ర కరువు బృందానికి పంట నష్టంపై సమగ్ర వివరాలను అందించేలా చర్యలు తీసుకున్నారు.

రైతుల సమస్యలను తెలుసుకున్న జేసీ

దొర్నిపాడు, జూన్ 19: మండలంలో రబీ పంటలు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్ట్రీరియల్ టీమ్ రానున్నట్లు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం దొర్నిపాడు వ్యవసాయ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారి సునీత మాట్లాడుతూ మండలంలో 2023-24 సంవత్సరానికి గాను 3,156 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని అన్నారు. శనగ 1503 మంది రైతులకు గాను 1600 హెక్టార్లు, జొన్న 1876 మంది రైతులకు గాను 1354 హెక్టార్లు, మినుము 155 మంది రైతులకు గాను 140 హెక్టార్లు, వరి 47 మంది రైతులకు గాను 30 హెక్టార్లు, ఇతర పంటలకు సంబంధించి 12 మంది రైతులకు 8 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో వీఏవో మురళీకృష్ణ, పీహెచ్‌వో నాగరాజు, ఏడీఏ సుధాకర్, ఎంపీడీవో సుబ్బారెడ్డి, వెటర్నరీ ఏడీఏ కొండారెడ్డి, వెటర్నరీ డాక్టర్ పావని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ ఉన్నారు.

రైతులతో ముఖాముఖి

ఉయ్యాలవాడ, జూన్ 19: మండలంలోని హరివరం గ్రామానికి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర కరువు బృందం రానున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజేంద్రకుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో శనగ పంట నష్టంపై రైతులతో రివ్యూ చేయటానికి కేంద్ర బృందం వస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల రైతులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. కేంద్ర బృంద పర్యటన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో మల్లికార్జున, డీఏవో మురళీక్రిష్ణ, డీహెచ్‌వో నాగరాజు, ఏడీఏ సుధాకర్ పరిశీలించారు.

ట్రాన్స్‌జండర్‌ను మోసం చేసిన యువకుడు

అద్దె ఇంట్లో సహజీవనం
మోసం చేశాడని హైదరాబాదులో ఫిర్యాదు చేసిన బాధితురాలు
తాలూకా స్టేషన్‌ను ముట్టడించిన ట్రాన్స్‌జెండర్ అసోసియేషన్ నాయకులు



ట్రాంజెండర్ హసిని గౌడ్‌తో ప్రియుడు బైచిగేరి గణేష్

ఆదోని రూరల్, జూన్ 19 : పరస్పరం ప్రేమలు పంచుకోడానికి ఇటీవల సోషల్ మీడియా వాహికగా పని చేస్తోంది. ఆదోని మండలం బైచిగేరి గ్రామానికి చెందిన రాముడు, ఆదిలక్ష్మి రెండో కుమారుడు గణేష్ ఎమ్మిగనూరు సమీపంలో ఉన్న ఎర్రకోట కాలేజీలో బి.టెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మూడేళ్ల కింద గణేష్‌కు ఇన్‌స్టాగ్రాంలో ట్రాన్స్‌జండర్ హసిని గౌడ్ పరిచయమైంది. మదనపల్లెకు చెందిన ఓ యువకుడు నాలుగు సంవత్సరాల క్రితం ట్రాన్స్‌జండర్‌గా మారడంతో కుటుంబ సభ్యులు బైటికి పంపించేశారు. ఆ వ్యక్తి హసిని గౌడ్ పేరుతో హైద్రాబాదులో నివాసం ఉంటోంది. ఇన్‌స్టాగ్రాంలో హసీనా, గణేష్ మధ్య స్నేహం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోయారు. అయితే తనకు పిల్లలు కారని, తాను ట్రాన్స్‌జెండర్‌నని, మనం స్నేహితులుగానే ఉందామని హసీనా గౌడ్ గణేష్‌కు చెప్పింది. అయినా పర్వాలేదు.. మన పెళ్లి చేసుకుందామని గణేష్ తేల్చి చెప్పాడు. ఆ తర్వాత గణేష్, హసిని హైదరాబాదులోని సనత్ నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని సహజీవనం ప్రారంభించారు. గణేష్‌ను హసీనా ప్రేమగా చూసుకుంది. రూ.లక్షల్లో గణేష్ కోసం ఖర్చు చేసింది. ల్యాప్‌ట్యాప్, ఖరీదైన సెల్‌ఫోన్ కొనిచ్చింది. అడిగినప్పుడల్లా రూ.లక్షల్లో డబ్బు ఇచ్చింది.

పెళ్లి చేసుకోమంటే ఉడాయించాడు... : సహజీవనంలో ఉంటున్న తనను పెళ్లి చేసుకోమని హసీనా కోరింది. దానికి గణేష్ అంగీకరించలేదు. కొన్ని రోజుల క్రితం తన సహచర ట్రాన్స్‌జండర్‌లతో కలిసి గణేష్‌ను నిలదీసింది. వారి నుంచి తప్పించుకొని గణేష్ సొంత గ్రామమైన బైచిగేరికి చేరుకున్నాడు. దీంతో ప్రేమ పేరుతో తనను మోసం చేశాడని, లక్షల్లో డబ్బులు ఇచ్చానని గణేష్‌పై హైదరాబాదులోని సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో హసీనా ఫిర్యాదు చేసింది. పోలీసులు గణేష్‌పై 420, 417 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

వారం రోజుల క్రితం తాలూకా స్టేషన్‌ను ముట్టడి : ప్రేమ పేరుతో తనను మోసం చేయడంతో పాటు చంపేస్తానని గణేష్, అతని అన్న ఫోన్‌లో బెదిరిస్తున్నారని వారం కిందట హసీనా, ఇతర ట్రాన్స్‌జండర్లు ఆదోని తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. తనకు న్యాయం చేయాలని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్.ఐ ఎర్రిస్వామిలను కోరింది.

హైదరాబాదు సీఐ ఫోన్ చేశారు: ఎర్రిస్వామి, తాలుకా ఎస్‌ఐ ఆదోని

హైద్రాబాదుకు చెందిన ట్రాంజెండర్ హసీనా హైదరాబాదులోని సనత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. అక్కడి సీఐ నాకు ఫోన్ చేసి బాధితురాలికి సహకరించాలని కోరారు. గణేష్ కుటుంబ సభ్యులు హసీనాను బెదిరించినట్లు ఆధారాలు ఉన్నాయి. అలాగే హసీనా గౌడ్‌ను గణేష్ మోసగించాడనడానికి కూడా పూర్తి ఆధారాలు ఆమె దగ్గర ఉన్నాయి. ఈ మేరకు చర్యలు తీసుకుంటాం.

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి కృషి

● న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న ఆప్టా నాయకులు



మంత్రి ఫరూక్‌ను కలిసిన హరిసర్వోత్తమరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 19: మైనర్ మీడియా ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి, రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్‌ను నంద్యాలలోని టీడీపీ ఆకార్యలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఉర్దూ ఉపాధ్యాయులు, ఉర్దూ పాఠశాలల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అసోషియేషన్ నాయకులు ఇబ్రహీం, జమాల్‌బాషా, హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను బ్రాహ్మణకొట్కూరు సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిసర్వోత్తమ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఖాజామోహిద్దీన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు హరిసర్వోత్తమరెడ్డి తెలిపారు.

విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

● శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డాను కలిసిన డీఈవో సుధాకరరెడ్డి



ఎమ్మెల్యే బుడ్డాను ఆశీర్వదిస్తున్న నాగసాధువు



ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి సమస్యలు తెలుపుతున్న ఈర్నపాడు నాయకులు

ఆత్మకూరు, జూన్ 19: నల్లమల చెంచుగిరిజన గూడేల్లో విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విద్యాశాఖ అధికారులకు సూచించారు. నంద్యాల డీఈవో సుధాకరరెడ్డి ఎమ్మెల్యే బుడ్డాను బుధవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చెంచుగూడేలు, తండాల్లోని పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బడిఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బాలికలకు సంబంధించి కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సీట్లను భర్తీ చేయాలని చెప్పారు. డీఈవో వెంట ఆత్మకూరు, నంద్యాల ఎంఈవోలు బాలాజీనాయక్, బ్రహ్మంనాయక్, రఘురామిరెడ్డి ఉన్నారు.

ఆశీర్వదించిన నాగసాధువులు

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి బుధవారం నాగసాధువులు ఆశీర్వచనం అందించారు. ఎమ్మెల్యే బుడ్డా ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఉండగా గుజరాత్‌లోని వడోదరా నుంచి శ్రీశైలానికి వాహనంలో వెళ్తున్న నాగసాధువులు కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న పార్టీ కార్యాలయం వద్ద జనం రద్దీని చూసి నేరుగా పార్టీ కార్యాలయంలోకి వెళ్లారు. ముందుగా ఎమ్మెల్యే బుడ్డాకు ఆశీర్వచనాలు అందించి ఆ తర్వాత ప్రత్యేక గదిలో ఆయనతో కాసేపు ఏకాంతంగా మాట్లాడారు.

అభినందనల వెల్లువ: ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి బుధవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు భారీగా తరలివచ్చి అభినందలు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారిగా ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా ఆ పార్టీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శులు ఫకృద్దిన్, అబ్దుల్లాపురం బాషాలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు తరలివచ్చి ఎమ్మెల్యే బుడ్డాకు శాలువలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా విద్యా, అటవీ, దేవాదాయశాఖ, విద్యుత్, ట్రెజరీ, పోలీసు, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీనియర్ న్యాయవాదులు కంచర్ల గోవిందరెడ్డి, కేశవరెడ్డి, వెంకటేశ్వర్లు, గిరిరాజు, నూర్‌అహ్మద్, లక్ష్మీనారాయణ, రవి, మాబాషా, మల్లికార్జునసింగ్, హరి ప్రసాద్, మాబు, మాబాషా, బతుకులయ్య తదితరులు ఎమ్మెల్యే బుడ్డాను కలిసి సత్కరించారు. అదేవిధంగా ఆత్మకూరు తాలుకా ఏపీఎన్‌జీఓ అధ్య క్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి ఎస్.సాజిద్‌బాషా, ఉపాధ్యక్షులు రాజశేఖర్, ఫకృద్దిన్ తదితరులు ఎమ్మెల్యే బుడ్డాను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం కూడా ఆయన ఆత్మకూరులో టీడీపీ కార్యాలయంలో అందుబాటులో ఉండనున్నట్లు ఆ పార్టీ నాయకులు వెల్లడించారు.

బండిఆత్మకూరు: మండలంలోని ఈర్నపాడు గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారించాలని ఆ గ్రామ నాయకులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కోరారు. బుధవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఆయకట్టు రోడ్లకు గ్రావెల్ వేయించాలని, డ్రైనేజ్ కాలువలు నిర్మించాలని కోరారు. నాయకులు చింతకుంట శ్రీనివాసరెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, ఎస్ ప్రతాపరెడ్డి, శ్రీను, లక్ష్మయ్య, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

'చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి'



బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

నందికొట్కూరు రూరల్, జూన్ 19: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని వడ్డెమాను అంగన్‌వాడీ కార్యకర్తలు శెట్టి లలితమ్మ, గాదె వెంకటరవణమ్మ, ఇందిరమ్మ సూచించారు. నందికొట్కూరు మండలంలోగల వడ్డెమాను గ్రామంలోని వీధులలో బుధవారం గర్భిణులు, చిన్నారుల తల్లులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లో చేర్పించాలని సూచించారు. సెంటర్లలలో చిన్నారులకు మంచి పౌష్టికాహారం, మంచి ఆటపాటలతో కూడిన కథనాలు, సృజనాత్మకతతో కూడి విజ్ఞానం, అక్షరాలు నేర్పిస్తారని తెలిపారు. ఇవన్నీ చిన్నారులకు మానసికంగా, శారీరకంగా ఎంతో దోహదపడతాయని తెలిపారు. వీటిపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకొని చిన్నారులను సెంటర్లకు పంపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయాలు సుశీలమ్మ, లక్ష్మీ, మమత, గర్భిణులు పాల్గొన్నారు.

'పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు'

పాణ్యం: పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు చేపట్టినట్లు ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాణ్యం హెచ్‌ఎం మేరీసునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కంప్యూటరైజేషన్‌కు సహకరించాలి'

బండిఆత్మకూరు, జూన్ 19: సహకార సంఘాల్లో జరుగుతున్న కంప్యూటరైజేషన్‌కు ఖాతాదార రైతులు సహకరించాలని సీఈవోలు గోపాల్, శ్రీనువాసులు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ సంతజూటూరులోని సహకార సంఘం, ఎ.కోడూరు సహకార సంఘాల్లో కంప్యూటరైజేషన్ చేస్తున్నారని, రైతులు ఆధార్, పాస్‌బుక్ జిరాక్స్, ఈసీ జిరాక్స్, నామిని ఆధార్ కార్డులు అందజేయాలని రైతులకు సూచించారు.

'కేన్సర్ నివారణపై అవగాహన తప్పనిసరి'

నందికొట్కూరు, జూన్ 19: ఆధునిక కాలంలో కేన్సర్ వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డా.అల్వాల నవీన్ కుమార్ సూచించారు. పట్టణంలోని జై కిసాన్ పార్కులో ఏఐటీయూసీ, శ్రామిక మహిళా ఫోరం ఆధ్వర్యంలో బుధవారం కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి, ఏఐటీయూసీ శ్రామిక మహిళా ఫోరం నందికొట్కూరు తాలుకా కమిటీ రజతమ్మ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. అల్వాల నవీన్ కుమార్ మాట్లాడుతూ కేన్సర్ మహమ్మారి కారణంగా ఎంతో మంది మరణిస్తున్నారని, ముందస్తుగా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు వనజమ్మ, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు వి.సంజమ్మ, మహిళా విద్యార్థి విభాగం నాయకురాలు పూజిత, దేవయాని, అంజలి, కవిత, చంద్రకళ, జయంతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

నంద్యాల (కల్చరల్), జూన్ 19: నంద్యాల ఆంజనేయ కోదండ రామస్వామి దేవస్థానానికి చెందిన భూములు, 3 రూములు బుధవారం కోటపాడు దేవస్థానం ఈవో వేణునాథరెడ్డి పర్యవేక్షణలో, ఈవో రామాంజనేయశర్మ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. మొత్తం ఈ వేలం పాట ద్వారా దేవస్థానానికి రూ.3,06,000 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. మూడు సంవత్సరాల కౌలుకు కాలపరిమితి కింద బహిరంగ వేలం నిర్వహించగా గతంలో వేలం కంటే రూ.46 వలే ఆదాయం అధికంగా వచ్చిందని చెప్పారు. అలాగే దేవస్థానానికి చెందిన 3 గదులకు బహిరంగ వేలం నిర్వహించగా నెలకు రూ.17,600 వచ్చినట్లు ఈవో తెలిపారు. నెలకు రూ.4100 రూపాయల అధికంగా వచ్చిందని ఈవో చెప్పారు. మొత్తం 17.77 ఎకరాలకు వేలం పాటలు నిర్వహించారు.

మహానంది: మహానంది మండలం బుక్కాపురం చెన్నకేశవస్వామి మాన్యం భూముల బహిరంగ వేలాల ద్వారా రూ.4.46 లక్షల ఆదాయం దేవదాయశాఖకు లభించినట్లు గ్రూపు దేవాలయాల ఈవో స్వర్ణముఖి తెలిపారు. బుధవారం బుక్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయం పరిసరాల్లో దేవాలయానికి చెందిన 15 ఎకరాల 84 సెంట్ల మాన్యం భూమికి 3 సంవత్సరాల కాల పరిమితి క్రింద బహిరంగ వేలాలు జరుపగా దేవదాయశాఖకు ఈ ఆదాయం వచ్చిందని చెప్పారు. మిగిలిన 10 ఎకరాల ఆలయ భూములకు త్వరలోనే బహిరంగ వేలాలు నిర్వహిస్తామని ఈవో చెప్పారు. ఈ బహిరంగ వేలాల్లో వెలుగోడు గ్రూపు దేవాలయాల ఈవో జనార్దన్‌శెట్టి, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో ఆలయ భూములకు బుధవారం దేవదాయశాఖ అధికారులు కౌలు వేలం పాటలు నిర్వహించారు. గ్రామంలోని ఈశ్వరస్వామి, ఎల్లమ్మ దేవత, కేశవరామచంద్రస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలకు చెందిన 113.82 ఎకరాలకు చెందిన భూములను కౌలు వేలం నిర్వహించగా రూ.17,20,000 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఏడీ వెంకటరమణ తెలిపారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో యువకుడికి జైలు శిక్ష

నంద్యాల క్రైం, జూన్ 19: నంద్యాలలోని శ్రీనివాససెంటర్ దగ్గర నంద్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ తన సిబ్బందితో నిర్వహించిన డంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి న్యాయస్థానం రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ బుధవారం తెలిపారు. గోస్పాడు గ్రామానికి చెందిన ఆల్వకొండ రాజేష్ అనే యువకుడు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడినట్లు సీఐ తెలిపారు. సదరు యువకుడిపై చార్జిషీట్ దాఖలుచేసి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.రామభూపాల్‌రెడ్డి ఎదుట హాజరు పరచగా రెండురోజుల జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పోస్టాఫీసు తనిఖీ

నంద్యాల రూరల్, జూన్ 19: నంద్యాల మండలంలోని పోలూర్ గ్రామంలోని పోస్టాఫీసును ఏడీ నాగనాయక్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పోస్టల్ శాఖలోని పథకాల గురించి సిబ్బందికి వివరించారు. పోస్టల్ పథకాల గురించి ఖాతాదారులకు వివరించాలని ఆయన సూచించారు. ఎస్‌పీఎం ఆలీషా, బీపీఎం జయమ్మ, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

పవన్ అభిమానుల సంబరాలు



కేక్ తినిపించుకుంటున్న పవన్ కళ్యాణ్ అభిమానులు

నందికొట్కూరు, జూన్ 19: జనసేన అధినేత, ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని శ్రీరామ థియేటర్ ఆవరణలో రామిరెడ్డి ఆధ్వర్యంలో అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రజలందరికీ మంచి చేకూరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు రవికుమార్, నవనంది స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్, జనసైనికులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న హోటల్ యజమాని

పాణ్యం, జూన్ 19: స్థానిక స్పందన హోటల్ యజమాని నిజాయితీ చాటుకున్నారు. బుధవారం ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరుకు చెందిన పార్శ నరసయ్య తన పిల్లలను సమీప పాఠశాలలో చేర్పించడానికి వెళ్తూ స్పందన హోటల్‌లో అల్పాహారం చేసి పర్సును మర్చిపోయారు. హోటల్ యజమాని పర్సును పరిశీలించగా అందులో రూ.15 వేలు సెల్‌ఫోన్ ఉన్నట్లు గమనించి పర్సును పోలీసుస్టేషన్‌లో అప్పజెప్పాడు. పర్సును మర్చిపోయిన నరసయ్య హోటల్‌కు వెళ్లి విచారించగా పోలీసు స్టేషన్‌లో అప్పజెప్పినట్లు తెలిపారు. దీంతో పోలీసుల వద్దకు వెళ్లి పర్సును నరసయ్యకు పోలీసుల ఆధ్వర్యంలో అప్పజెప్పాడు. పర్సులోని నగదు, సెల్‌పోన్ ఉండడంతో హోటల్ యజమనికి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు సిబ్బంది హరి నిజాయితీకి అభినందనలు తెలిపారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

నంద్యాల (కల్చరల్), జూన్ 19: నంద్యాల జయంతీ వెజ్‌వరల్డ్‌లో బుధవారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన వక్త ఆత్మకూరు, గోకవరం భక్తకన్నప్ప ఆవాసం కార్యదర్శి రఘురాములు పాల్గొని మాట్లాడుతూ శివాజీ మహారాజ్ పోరాటం స్ఫూర్తి, గెరిల్లా పోరాట రీతులు, ఆయన ధర్మనిష్ఠ మాత్రమే అని, ఆయన పరిపాలన విధానం, ఆర్థిక విదానం, విదేశీ వాణిజ్యం నేటికి ఎన్నో సమస్యలకు సమాధానమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



విద్యుత్ వాడకాన్ని ఎలా తగ్గించాలనే అంశంపై గీసిన చిత్రాన్ని చూపుతున్న విద్యార్థులు

మహానంది, జూన్ 19: మహానంది మండలం ఎం.తిమ్మాపురం గ్రామంలోని జడ్పీ పాఠశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు విద్యుత్తును ఎలా వినియోగించాలి, వాడకాన్ని ఎలా తగ్గించాలనే అంశాలతో పాటు భవిష్యత్తు ఇందనాలైన సోలార్, పవన విద్యుత్ గురించి చిత్రపటాలను గీసి వివరించారు.హెచ్‌ఎం నారాయణ, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, చంద్రశేఖర్, నాగరాజు, ప్రేమ్‌కుమార్, హరిత పాల్గొన్నారు.

'ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి'

మహానంది, జూన్ 19: గిరిజన విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని తిమ్మాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఎంపీహెచ్‌ఈవో ఆధ్వర్యంలో సిబ్బంది రక్త పరీక్ష నమూనాలను సేకరించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. హెచ్‌ఎం అంబమ్మ, వైద్యసిబ్బంది హేమలత, సికింధర్, విజయ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేటి వేలం పాట వాయిదా

నంద్యాల (కల్చరల్), జూన్ 19: నంద్యాలలో గాంధీచౌక్ ఏరియాలో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానానికి చెందిన దుకాణాలకు గురువారం వేలం పాట వాయిదా వేస్తున్నట్లు ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. అలాగే కోటవీధిలో వెలసిన బ్రహ్మానందీశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములు కౌలుకు, రూములు బాడుగకు బహిరంగ వేలం పాటను అనివార్యకారణాల వలన తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.

నందీశ్వరస్వామికి విశేష పూజలు



నందీశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, జూన్ 19: శ్రీశైల క్షేత్రంలో బుధవారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయంప్రదోషకాలంలో ఆలయములోని మల్లికార్జునస్వామికి అభిముఖంగా కొలువైవున్న నందీశ్వరస్వామికి పరోక్షసేవగా విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణపతి పూజను నిర్వహించారు. అనంతరం నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, పలు ఫలోదకాలతో, కుంకుమోదకం, హరిద్రోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికార్జున గుండంలోని శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించి అనంతరం అన్నాభిషేకం జరిపారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో పూజలలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్షసేవల ద్వారా అవకాశం కల్పించింది. భక్తులు ఈ పరోక్షసేవలో పాల్గొనేందుకు దేవస్థానం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శ్రీశైలదేవస్థానం.ఓఆర్‌జీ ద్వారా ఒక్కోపూజకు రూ.1,116 సేవారుసుమును చెల్లించి పాల్గొనవచ్చు. సేవాకర్తలే కాకుండా, భక్తులందరూ కూడా నందీశ్వరస్వామి అర్జిత పరోక్షసేవ పూజా కార్యక్రమాన్ని శ్రీశైల టీవీ లేదా యూట్యూబ్ ద్వారా వీక్షించవచ్చును.

● శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణం కోసం బుధవారం ఉదయం సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం, పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, కలశోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని జరిపి మహామంగళహారతులను సమర్పించారు. అలాగే జ్వాలావీరభద్ర స్వామికి ప్రదోషకాలంలో విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది.

● శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో బుధవారం తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డిజిల్లా, అమీర్‌పేటకు చెందిన స్పందన డాన్స్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

'పాత పద్ధతిలోనే తరగతులు కొనసాగించాలి'

కొత్తపల్లి, జూన్ 19: ప్రస్తుతం కొనసాగుతున్న 1 నుంచి 5 తరగతులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని స్పెషల్ స్కూల్ మాజీ చైర్మన్ ఈ.రాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎంఈవోలు శ్రీరాములు ఇనయతుల్లాలకు 1 నుంచి 5 తరగతులను హై స్కూల్‌లో విలీనాన్ని వెనక్కి తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ దుద్యాల గ్రామంలోని ప్రభుత్వ స్పెషల్ స్కూల్ నందు 1 నుంచి 5వ తరగతి వరకు జరిగే తరగతులను హై స్కూల్‌లో విలీనం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎస్సీ కాలనీ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చిన్నారులు రావాలంటే కిలోమీటరు కన్నా ఎక్కువ దూరం ఉందన్నారు. పాఠశాలకు వెళ్లేటప్పుడు రోడ్డుపై ఆటోలు, బైకులు, బస్సులు ఇతర వాహనాలు అడ్డు వస్తున్నాయన్నారు. వీటన్నింటిని దాటుకుని పాఠశాలకు పోయి రావాలంటే చిన్న పిల్లలకు ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయందోళనలకు గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితి క్షుణ్ణంగా అధికారులు పరిశీలించి మా చిన్న పిల్లలకు 1 నుంచి 5వ తరగతి వరకు స్పెషల్ స్కూల్స్‌లోనే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎ.ఓబులేసు, ఇ.అశోక్, వెంకటేశ్వర్లు, గోపాల్ పాల్గొన్నారు.

అధికారులు తక్షణమే స్పందించాలి: ఎమ్మెల్యే



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూన్ 19: నందికొట్కూరు మండలంలోని ఏ గ్రామంలో ఎక్కడ సమస్య ఉదని తెలిసినా సంబంధిత అధికారులు తక్షణమే స్పందిచాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య మండల అధికారులను ఆదేశించారు. బుదవారం నందికొట్కూరు మండలం అభివృద్ధి కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో ఎమ్మెల్యే జయసూర్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు గత ప్రభుత్వం లో మాదిరిగా కాకుండా ప్రస్తుతం ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని అన్నారు. ఎక్కడ ప్రజలకు సమస్యవచ్చినా కచ్చితంగా సంబంధిత శాఖా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆసమస్యను తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. అన్నిశాఖల అధికారులను పేరుపేరున పరిచయం చేసుకున్నారు. అందరి సహాయ సహకారాలు కావాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదరరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సంజన్న, సెబ్ సీఐ సీతారామిరెడ్డి, వీఆర్వోలు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మురుగు కాలువలు నిర్మించాలి'



కొత్తకొట్టాల వీధిలో నిలిచిన నీటిని చూపుతున్న నాయకుడు

పాణ్యం, జూన్ 19: పాణ్యంలోని కొత్త కొట్టాలలో వర్షం వస్తే నడవలేని పరిస్థితి ఏర్పడిందని, మురుగు కాలువలు నిర్మించాలని జనసేన నాయకుడు జగదీశ్ కోరారు. బుధవారం ఆయన కాలనీలో పర్యటించారు. జగదీశ్ మాట్లాడుతూ కాలనీ ఏర్పడి ఇరవై ఏళ్లు కావస్తున్నా సరైన మురుగు కాలువలు లేవని, చిన్న వర్షానికే వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయని అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి నీరు ఎక్కడికీ పోలేక నిల్వ ఉండడంతో దోమలు వ్యాపిస్తున్నాయని, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. సీసీ రోడ్లు వేసినా ఫలితం లేదన్నారు. కాలనీ వాసులు బురదలోనే నడవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కాలనీలో రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. సమస్యను అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పవన్, సురేష్, శీను, మహిళలు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో సర్వే



బలపాలతిప్పలో రైతులతో చర్చిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కొత్తపల్లి, జూన్ 19: కొత్తపల్లి మండలంలోని జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్దేశ్వరం గ్రామాలకు చెందిన ముంపు భూములను స్థానిక పేద రైతులే సాగు చేసుకునే విదంగా ప్రభుత్వం అవకాశం కల్పించాలన్న టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి డిమాండ్‌తో ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారుల్లో కదలిక మొదలైంది. మంగళవారం టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ముంపు గ్రామాల రైతులతో భూములు సాగుపై చర్చించేందుకు సంగమేశ్వరం వచ్చారు. అక్కడ బైరెడ్డి ప్రత్యేక పూజలనంతరం ముంపు గ్రామాల రైతులతో చర్చించేందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు, ఇరిగేషన్ అధికారులు 145 సెక్షన్ అమలులో ఉన్నందున నిషేధిత భూముల వద్దకు వెళ్లవద్దని శాంతిభద్రతల సమస్యలకు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. ఎట్టకేలకు బైరెడ్డి మంగళవారం సాయంత్రం వరకు అక్కడే ఉండి ఉన్నత అధికారులతో పోన్‌లో చర్చించి స్థానిక ముంపు బాధితుల గోడును విన్నవించారు. దీంతో బుధవారం కర్నూలు ఇరిగేషన్ డీఈ గీతా మహాలక్ష్మి, కలెక్టరేట్ ఇరిగేషన్ ఏఈ విజయకుమార్ రెడ్డి, స్థానిక వీఆర్వో మౌలాలితో కలిసి సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాల గూడెం రైతులు స్థానికంగా ఉన్నారా లేదా అనే వాటిపై క్షేత్ర స్థాయిలో వారు ఇంటింటి సర్వే నిర్వహించి వారి వద్ద ఉన్న ఆధార్, రేషన్, ఓటరు కార్డులను అడిగి వివరాలు సేకరించి, వారి స్థానికతను నిర్ధారించుకుని వెళ్లిపోయారు.

'రాహుల్‌గాంధీ నాయకత్వం దేశానికి అవసరం'



కేక్ కట్ చేస్తున్న లక్ష్మీనరసింహ

కల్లూరు, జూన్ 19: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్‌గాంధీ నాయకత్వం భారతదేశానికి ఎంతో అవసరమని కాంగ్రెస్ నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహ అన్నారు. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జే.లక్ష్మీనరసింహ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గణనీయమైన ఓట్లు, సీట్లు సాధించిందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కూటమికి 240 సీట్లు రావడం హర్షించదగ్గ విషయ మన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, బోయ రమణ, మైనార్టీ నాయకులు జాకీర్‌హుసేన్, ఆసిఫ్ ప్రసాద్ పాల్గొన్నారు.

'పండ్ల తోటల సాగుతో అభివృద్ధి'

కొత్తపల్లి, జూన్ 19: పండ్ల తోటలతో రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని రైతులు పండ్ల పెంపకం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఏపీవో రేష్మా సూచించారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం నందు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఃశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పండ్ల తోటలను పెంచుకోవడంతో రైతులు ఎలా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్న విషయాలను రైతులకు ఫీల్డ్ అసిస్టెంట్లు వివరించాలని చెప్పారు. మండలంలో ఇప్పటి దాకా 157 ఎకరాలకు పండ్ల తోటల పెంపకం చేసుకునేందుకు రైతులు ముందుకు వచ్చారన్నారు. ఇందులో 16 రకాల పండ్ల మొక్కలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ దర్వారా రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో మామిడి, జామ, సపోట, నేరేడు, నిమ్మ, ఆరేంజ్, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, మల్లెపూలు, డ్రాగన్‌ఫ్రూట్, మునగ, రోజ్, ఆపిల్‌బేర్, అంజీర పండ్ల తోటలు పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. 5 ఎకరాలలోపు ఉండే రైతులెవరైనా ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలంయంలో మూడు నాలుగు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విదంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా హౌసింగ్ శాఖలో కల్పించే 90 రోజుల పనిదినాలకు ఆశాఖ సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన సుబ్బారెడ్డి


చంద్రబాబును కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, జూన్ 19: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి అమరావతిలో సీఎం చంద్రబాబు సుబ్బారెడ్డి పూలబొకే అందజేసి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గౌరవ సభలో అడుగు పెడుతానని చంద్రబాబు శపథాన్ని నెరవేర్చేలా రాష్ట్ర ప్రజలు తీర్పు ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు రాత్రింబవళ్లు కష్టపడి పని చేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకున్నారన్నారు. వైసీపీ పాలనలో నిర్వీర్యమైన రాజధాని అమరావతి, పోలవరం, రాయలసీమ అభివృద్ధికి చంద్రబాబు జీవం తెస్తున్నారన్నారు.

ఆ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల, జూన్ 19: పట్టణంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవా లని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ బేతంచెర్ల పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్డు అదుపు లేకుండా పోయిందని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐ ఎస్ఎఫ్ మండల నాయకులు గణేష్, మనోహర్, మధు, కృష్ణ రమేష్, మహేష్ ఉన్నారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న టీడీపీ నాయకుడు

బేతంచెర్ల, జూన్ 19: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను బుధవారం టీడీపీ నాయకుడు భీమేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. భక్తులకు చల్లని తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, మధు లోకేశ్వరరెడ్డి, మోహన్‌గౌడ పాల్గొన్నారు.

నాటుసారా విక్రయాలను అరికట్టండి: సీపీఎం

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 19: మండలంలోని వివిధ గ్రామాలలో నాటు సారా విక్రయాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, అధికారులు వాటిని అరికట్టాలని కొలిమిగుండ్ల మండల సీపీఎం కార్యదర్శి దావీదు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రధాన వీధులు, జనసంచారం మధ్యనే నాటుసారా విక్రయాలు కొనసాగుతుండటంతో మహిళలు బయట తిరగలేక పోతున్నారన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని నాటుసారా, బెల్ట్ షాపులు అరికట్టాలని కోరారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

కోవెలకుంట్ల, జూన్ 19: కోవెలకుంట్ల పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు కనబరిచిన విద్యార్థినులకు సేవా సదన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు బుధవారం ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో ప్రథమ స్థానం, మండలంలో మూడోస్థానంలో 581 మార్కులు సాధించిన విద్యార్థిని గుణమ్మకు రూ.15వేలు, ద్వితీయ స్థానంలో 575 మార్కులు సాధించిన సమీరకు రూ.10వేలు, మూడోస్థానంలో 574 మార్కులు సాధించిన గీతారాణికి రూ.5వేలు ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో సేవాసదన్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: పదో తరగతిలో కేజీబీవీ పాఠశాలకు చెందిన మానస అనే విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలవడంతో రూ.5వేలు బహుమతిగా అప్సా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విజయ నాగరాజు, గూండా గోపాల్ బుధవారం అందజేశారు. అదేవిధంగా ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహా యాదవ్ 90 మార్కులకు పైబడి సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.500 నగదు బహుమతిని అందజేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ అబీదాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

కోవెలకుంట్ల, జూన్ 19: మండలంలోని బిజినవేముల గ్రామంలో నిర్వహించిన ఆలయ భూముల కౌలు వేలంలో ఆదాయం పెరిగినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసయ్య తెలిపారు. బుధవారం ఉదయం గ్రామంలోని శివాలయం వద్ద 28 ఎకరాల ఆలయ భూములకు మూడు సంవత్సరాల పాటు కౌలు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన వేలం పాటలో ఈ భూములకు రూ.1.62 లక్షలు రాగా, ఈ ఏడాది నిర్వహించిన వేలం పాటలో రూ.4.22 లక్షలు వచ్చిందన్నారు. గతంలో కంటే ఈ ఏడాది అదనంగా రూ.2.60లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రుడు, గ్రామ పెద్దలు, పోలీసులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

సంజామల, జూన్ 19: మండలంలోని వసంతాపురంగ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయ భూములను బుధవారం కౌలు వేలం నిర్వహించారు. స్వామివారికి సంబంధించి 26 ఎకరాల భూములకు సంబంధించి కౌలు వేలం నిర్వహించగా ఈవో చంద్రుడు, అర్చకుడు సత్యమయ్య నిర్వహించిన వేలం పాటల్లో గ్రామానికి చెందిన రైతులు రూ.4.22 లక్షలకు భూములను కౌలుకు తీసుకున్నారు.

'నిర్లక్ష్యం వీడండి'

ఉయ్యాలవాడ, జూన్ 19: విధుల్లో నిర్లక్ష్యం వీడి పని చేయాలని ఎంపీడీవో రఘురామ్ హెచ్చరించారు. బుధవారం కొండుపల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ క్రమం తప్పకుండా రిజిస్టర్‌లో సంతకాలు చేస్తుండాలన్నారు. వీలుకు వెళ్లేటప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'అభివృద్ధికి కృషి'

శిరివెళ్ల, జూన్ 19: మండలంలోని పోయిప్ప సంఘాల్లో ఉన్న మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వెలుగు ఏపీఎం సంపత్ ప్రతినిధులు అన్నారు. బోయలకుంట్ల గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, అరుణ దంపతులను మండలంలోని వీవోఏలు శాలువా, పూలమాలలతో బుధవారం సన్మానించారు. గ్రామాల్లోని పేద మహిళల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం అందించబోయే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలు తీసుకున్న రుణాలతో ఆర్థిక ప్రగతిలో ముందుకు సాగేలా చేయూత అందిస్తామన్నారు.

నేనున్నానని..

ప్రజల వద్దకు డోన్ ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూన్ 19: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారు. ప్రజల వద్దకే వెళ్ళి నేనున్నానంటూ ఎమ్మెల్యే కోట్ల భరోసా కల్పిస్తున్నారు. బుధవారం పట్టణంలోని ఆటోన గర్‌లో ఉదయం 7 గంటలకే ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పర్యటించారు. ప్రజలతోనే నేరుగా మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల్లో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్ర పాలనను గాడిలో పెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారని తెలిపారు. డోన్ మున్సిపాలిటీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. బేతంచెర్ల సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోట్ల ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికె ఫణిరాజ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, ఓబులాపురం శేషిరెడ్డి, జిల్లా టీడీపీ ఆదికారి ప్రతినిధి విజయభాస్కర్, ఓబులేసు, అలేబాదు పరమేష్, ఆంజనేయగౌడ్, పాల్ రాజు, టైలర్ బాజా, బీజేపీ నాయకులు వడ్డే మహరాజ్ పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే కోట్లను కలిసిన ఎన్జీవో అసోసియేషన్ నాయకులు: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని


ఎమ్మెల్యే కోట్లను అభినందిస్తున్న బేతంచెర్ల టీడీపీ నాయకులు


ఆటోనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బుధవారం ఉమ్మడి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, కార్యదర్శి జవహర్‌లాల్, కార్యవర్గ సభ్యులు సాంబశివారెడ్డి, క్రిష్ణమోహన్, రామకృష్ణారెడ్డి, జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, డోన్ తాలూకా అధ్యక్షుడు షమీవుల్లా, ప్రేమ్ కుమార్, మస్తాన్ కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

కోట్లతోనే బేతంచెర్ల అభివృద్ధి

బేతంచెర్ల: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డితోనే బేతంచెర్ల అభివృద్ధి చెందుతుందని టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు విజయరా మవరావు, టీడీపీ మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, సమన్వయ చైర్మన్ సుధాకర్‌లు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కోట్లను తన స్వగృహంలో వారు కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కోట్ల గెలుపు కోసం టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రామవరావు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, టీడీపీ పట్టణ సమన్వయ చైర్మన్ సుధాకర్, డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు బుగ్గన ప్రసన్నలక్ష్మి, డోన్ యువ నాయకురాలు కోట్ల చిత్తమ్మ, జనసేన, బీజేపీ నాయకులు కృషి చేశారన్నారు. డోన్, ప్యాపిలి, మండలాల కంటే బేతంచెర్ల మండలం టీడీపీకి అత్యధిక మెజారిటీ రావడంతో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపు సాధ్యమైందన్నారు.

నేడు భీమునిపాడుకు కేంద్ర కరువు బృందం


అధికారులు, రైతులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల, జూన్ 19: మండలంలోని భీమునిపాడుకు కేంద్ర కరువు బృందం గురువారం వస్తున్నట్లు నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి భీమునిపాడు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో వర్షాభావంతో రైతులు సాగు చేసిన పంటలు పండక కరువు పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం కరువు మండలంగా కోవెలకుంట్లతో పాటు ఇంకా కొన్ని మండలాలు ప్రకటించడంతో ఆయా మండలాల్లో అధికారు లు రైతుల జాబితా తయారు చేసి ఉన్నతాధికారులకు పంపామన్నారు. ప్రభుత్వం కేంద్రానికి నివేదిక అందించి కరువు సాయాన్ని అందించాలని కోరడంతో కేంద్ర బృందం గురువారం భీమునిపాడుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు జయప్రకాశ్, వ్యవసాయాధికారి నిరంజన్ పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో రక్తహీనత దూరం

శిరివెళ్ల, జూన్ 19: సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురి కాకుండా ఉండవచ్చని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ముజీబ్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి సూచించారు. శిరివెళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ అనీమియా నివారణపై ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సికిల్ సెల్ అనీమియాకు గురైన వ్యక్తుల్లో రక్త కణాల సంఖ్య తగ్గడం, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలసట, అంటు వ్యాధులకు గురవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ నర్సమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్‌పై అవగాహన

రుద్రవరం, జూన్ 19: మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎర్రగుడి గ్రామంలో పీఎం జన్‌మన్ కార్యక్రమంపై వైద్యాధికారి అమరేనాథరెడ్డి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెంచుగూడెల్లో రక్తహీనత చెక్ పెట్టడానికి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. 331 మందికి రక్తపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రక్తహీనత వల్ల రక్త కణాల సంఖ్య తగ్గడం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది, అలసట, గర్భధారణలో సమస్యలు కలుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లేశ్వరి, బాల నరసింహుడు, ఎంఎల్‌హెచ్‌పీ సుస్మితారాణి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి: ఏడీ

బనగానపల్లె, జూన్ 19: పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని బనగానపల్లె పశువైద్య శాఖ ఏడీ మారుతీ సాంబారం అన్నారు. బుధవారం అవుకు, బనగానపల్లె మండల పరిధిలోని పశువైద్య సిబ్బందితో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లె, అవు కు మండలాల్లో 70 శాతం పశువులకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్య అధికారులు డాక్టర్ బ్రహ్మ నందారెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చినబాబు, ఐశ్వర్య రామచంద్రారెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల, జూన్ 19: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు మేరీరాణి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, అంగన్‌వాడీ మండల నాయకురాలు నాగలక్ష్మి అధ్యక్షతన అంగన్‌వాడీల మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయ కులు వై. బాలవెంకట్, వైటీ వెంకటేశ్వర్లు, ఎస్. గుల్జార్‌బీ, రాజేశ్వరి, మధురవాణి, మహాలక్ష్మి, విజయలక్ష్మి, వనజ, అరుణ, నాగసుబ్బమ్మ, సుబ్బమ్మ, రమాదేవి, ఆదిలక్ష్మి, మల్లేశ్వరి, సుబ్బలక్ష్మి, జ్యోతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

బనగానపల్లె, జూన్ 19: 17వ విడత పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి నుంచి ప్రతి రైతుకు రూ.2వేలు నిధులు విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని బనగానపల్లె మండల వ్యవసాయ కార్యాలయంలో లైవ్‌లో బుధవారం రైతులకు ప్రదర్శించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులకు 17వ విడత పీఎం కిసాన్ నిధులు రూ.2వేలు రైతుల ఖాతాల్లో జమచేశారన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతుకు చేయూతనందిస్తాం: ఎమ్మెల్యే అఖిలప్రియ

శిరివెళ్ల, జూన్ 19: రాష్ట్రంలోని ప్రతి రైతుకు చేయూతనందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం నుంచి రాయితీపై వచ్చిన జీలుగ విత్తనాలను ఆమె రైతులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకున్న 1,685 మంది రైతులకు 570 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను అందజేస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు కరువయ్యాయని అన్నారు. అమ్మవారిశాల వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే అఖిలప్రియకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వాసవీమాతకు అఖిలప్రియ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఆళ్లగడ్డ ఇన్‌ఛార్జ్ ఏడీఏ నాగేంద్ర ప్రసాద్, శిరివెళ్ల ఏవో సుధాకర్, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, పుల్లారెడ్డి, లక్ష్మీరెడ్డి, జయరామిరెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మీప్రసాద్, నాగిరెడ్డి, రామ్మోహన్, బాలగంగిరెడ్డి, యామా గుర్రప్ప, సూరా రామ, మోహన్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

ఆళగడ్డ: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను బుధవారం నంద్యాల ఆర్టీవో మల్లికార్జునరెడ్డి, ఈవీఎస్‌లర్ నజీర్ అహమ్మద్, డీలర్లు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సన్మానించారు. అలాగే ఆళ్లగడ్డ పట్టణంలోని ఆమె స్వగృహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం అధిక సంఖ్యలో వచ్చి శుభాకాంక్షలు చెప్పారు.


ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు


యర్రగుంట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

రుద్రవరం: రుద్రవరం మండలంలో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశించారు. బుధవారం రుద్రవరం మండల అధికారులు ఆళ్లగడ్డ ఎమ్మెల్యేను అఖిలప్రియను ఆమె స్వగృహంలో కలిసి శాలువాతో సన్మానించి పూలబొకేలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ఇప్పుడు చేయాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

చాగలమర్రి: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను బుధవారం చాగలమర్రి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఆమె నివాసానికి తరలివెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి నల్లా నాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మాలమహానాడు నాయకులు

ఉయ్యాలవాడ: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను రాయలసీమ మాలమహానాడు నాయకులు ఆమె స్వగృహంలో బుధవారం కలిశారు. మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కోయిల ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సంజాం మండల అధ్యక్షుడు పుల్లయ్య ఉన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

అవుకు, జూన్ 19: బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలని ఎంఈవో శ్రీధర్‌రావు అన్నారు. బుధవారం బడికిపోదాం కార్యక్రమంలో భాగంగా అవుకు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శింగయ్య, ఉపాధ్యాయులు బజార్, వాసుకృష్ణమోహన్, ఫిజికల్ డైరెక్టర్ శశికళ, సీఆర్పీలు రామ్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్యాపిలి: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవో వెంకటేశ్వర నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని పేరుసోముల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నేను బడికిపోతా కార్యక్రమంపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఈశ్వరయ్య, హెచ్ఎం సీతారామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గుడిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దొర్నిపాడు: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఏడుబ్బావద బ్బా తలశమ్మ సూచించారు. బుధవారం మండలంలోని డబ్ల్యూగోదిండ్ల గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో 5 సంవత్సరాలు దాటిన చిన్నారులను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్పర్ రియా జబీ, అంగన్‌వాడీ టీచర్ వాణి, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

ఘనంగా సీతా రామచంద్ర స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె, జూన్ 19: బనగానపల్లె పట్టణ శివారులోని యనకండ్ల జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో సీతారామచంద్రస్వామి కళ్యాణాన్ని బుధవారం రామానుజ చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించా రు. ఈ వేడుకల్లో షైహైం ఇండస్ట్రీస్ అధినేత జూపల్లి రామేశ్వరావు, కుమారి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాగశాలలో నిత్యారాధనలు, చతుస్థానార్చన, మానవ మంత్ర హవన పారాయణం, సీతారామచంద్రస్వామి కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం హనుమద్వాహన సేవ, తీర్థ ప్రసాదాల కార్యక్రమం నిర్వహించారు.

'పౌష్టికాహారంతో ఆరోగ్యం'

రుద్రవరం, జూన్ 19: పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలమని వైద్యాధికారి డాక్టర్ శివమోహన్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ రక్తహీనత నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చెంచుగూడేల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వైద్యపరీక్షలు చేయించి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

బనగానపల్లె, జూన్ 19: బీసీ జనార్దన్‌రెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కావడంతో బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని శివనందనగర్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బనగానపల్లె పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, సీనియర్ టీడీపీ నాయకులు అన్వర్‌హుస్సేన్, కరీం బాబు, నియాజ్‌హుస్సేన్, అహమ్మద్‌హుస్సేన్, అమీర్‌జాన్, అహమ్మద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

బేతంచెర్ల, జూన్ 19: ఛత్రపతి శివాజీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని నాగమోహన్ రెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు అన్నారు. బుధవారం రం పట్టణంలోని హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రమణ, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, మణికంఠ, అజయ్ పాల్గొన్నారు.

'పారిశుధ్యం లోపించకుండా చూడాలి'

రుద్రవరం, జూన్ 19: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ పంచాయతీ పరిధిలో మురుగు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లించాలన్నారు. పైపులైన్ లీకేజీ ఉంటే మరమ్మతులు చేయించాలన్నారు.

'రైతులు ఓటరుగా నమోదు చేసుకోవాలి'

చాగలమర్రి, జూన్ 19: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఓటు హక్కు ఉన్న రైతులు రెన్యూవల్ చేసుకోవాలని, అలాగే కొత్తవారు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవా లని సీఈవో కె.హుసేనమియా తెలిపారు. బుధవారం చాగలమర్రి సొసైటీలో ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పొలం పాసుపుస్తకం జిరాక్స్, రెండు పోటోలు, మొబైల్ నంబర్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

శిరివెళ్ల: మండలంలోని బోయలకుంట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)లో ఓటుహక్కు కలిగిన రైతులు తమ ఆధార్ కార్డు, పాన్ కార్డు, పొలం పట్టాదారు పాసుపుస్తకం, నామినీ ఆధార్ కార్డు జిరాక్సు ప్రతులతో పాటు మూడు ఫొటోలను సొసైటీలో అందజేయాలని సీఈవో చిన్నగిరి బుధవారం తెలిపారు. సొసైటీలను కంప్యూటరైజేషన్ చేస్తున్నందున ఓటుహక్కు ఉన్న రైతులంతా పైన కన బరచిన వివరాలను ఈ నెల 30వ తేదీలోపు అందజేయాలని సూచించారు.

ముగిసిన గ్రామ పంచాయతీ వేలం

కోవెలకుంట్ల, జూన్ 19: పట్టణంలోని మేజరు గ్రామ పంచాయతీలో ఈవోఆర్డీ రాధికారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ వేలం పాట ముగిసింది. ఉదయం 11గంటలకు ప్రారంభమైన వేలం పాటలో సంత మార్కెట్‌కు రూ.13.50 లక్షలు సర్కారు వారి పాట నిర్వహించగా రూ.15. 21 లక్షలు శ్రీనివాసులు దక్కించుకున్నారు. దిన మార్కెట్‌కు రూ.6.60 లక్షలు పాట నిర్వహించగా కె.వెంకటేశ్వర్లు రూ.6.46 లక్షలకు పాడి పాట దక్కించుకున్నారు. అలాగే బస్టాండుకు వేలం పాట నిర్వహించగా రూ.6.52 లక్షలకు వేలం పాటను ఎస్.శ్రీనివాసులు దక్కించుకున్నారు. కబేళాకు వేలం పాట నిర్వహించగా రూ.7500కు పకీర్ దక్కించుకున్నారు. ఈ ఏడాది మార్చిలో ఎన్నికలు ఉండడం వల్ల మూడు నెలల కాలపరిమితి తగ్గింది తొమ్మిదినెలలకు మాత్రమే వేలం పాట నిర్వహించామని ఈవో గోపినాథ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసి, ఉపసర్పంచ్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'రక్తహీనతతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూన్ 19: గ్రామాల్లో ప్రజలు సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు డాక్టర్ ఇమ్రాన్ సూచించారు. బుధవారం చాగలమర్రి గ్రామంలోని చెంచుగూడెంలో సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 13 సచివాలయాల పరిధిలో ఈ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధి లక్షణాల గురించి తెలియజేశామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామ లింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర, ఏఎన్ఎంలు గ్రేస్, నాయక్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే మండలంలోని డివనిపెంట చెంచుగూడెం గ్రామంలో ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు చెంచులకు వ్యాధి లక్షణాల గురించి తెలియజేశారు. సీహెచ్‌వో వెంకమ్మ, ఏఎన్ఎం సంధ్యా పాల్గొన్నారు.

అవుకు: సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిపై వైద్యశిబిరం అవగాహన కలిగి ఉండాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. బుధవారం అవుకు మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్లు వినోద్ కుమార్, మయన, నవీన్ ఆధ్వర్యంలో సికిల్‌సెల్ వ్యాధిపై వైద్యసిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ సికిల్‌సెల్ వ్యాధి జన్యుపరంగానే ఏర్పడుతుందన్నారు. మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, హెల్త్‌సూపర్‌వైజర్లు వేణుగోపాల్‌రాజు, దానమ్మ, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో సికిల్‌సెల్ ఎనిమియాపై అవగాహన సదస్సు శుక్రవారం రూరల్ మండలం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి కేశవరావు కొద్దిమందితో సంబంధిత సిబ్బంది పని పూర్తి చేశారు. జిల్లా మలేరియా అధికారి వచ్చినా వైద్య సిబ్బంది కనీసం జనాన్ని కూడగట్టలేకపోయారు. మలేరియా అధికారి మాట్లాడుతూ యువతీ యువకులు రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు.

నూతన చట్టాలపై పోలీసులకు శిక్షణ

నంద్యాల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నూతన చట్టాలపై ఆళ్లగడ్డ పోలీస్ సర్కిల్ లోని పోలీసులకు శిక్షణ ఇస్తున్నట్లు రూరల్ సీఐ హనుమంతనాయక్ తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను తెచ్చిందని ఆయన తెలిపారు.